సాక్షి
వికారాబాద్
గురువారం । 1 । మే । 2025



కోతల జోరు..

ప్రస్తుతం వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఎక్కడ చూసిన హార్వెస్టర్లు, నూర్పిళ్ల సందడి దర్శనమిస్తోంది. 12లో▸



సేవలు అభినందనీయం

విధి నిర్వహణలో మనం ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. 12లో▸



పెళ్లింట విషాదం

పెళ్లింట విషాదం నెలకొంది. పెళ్లి కూతురు తాత మృతిచెందగా.. తండ్రి మృత్యువుతో పోరాడుతున్నాడు. 12లో▸

న్యూస్‌రీల్

కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్



తాండూరు టౌన్: కేంద్ర కేబినెట్ జనగణనలో కుల గణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న బీసీలు ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు కేంద్రం ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. తెలంగాణ, బిహార్ రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కుల గణన చేపట్టడంతో కేంద్రంపై ఒత్తిడి పెరిగిందని.. బీసీల పోరాటానికి ఫలితం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50శాతం పరిమితిని ఎత్తివేసి తెలంగాణలో 42 శాతం, బిహార్‌లో 65 శాతం రిజర్వేషన్లను కేంద్రం ఆమోదించాలన్నారు. కులగణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ

తాండూరు రూరల్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పడతాయని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గౌతపూర్ గ్రామంలో పది సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటి యజమానులు ఇళ్ల వద్ద, వ్యాపారస్తులు వ్యాపార కేంద్రాల వద్ద తప్పక సీసీ కెమెరాలు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన గౌతపూర్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు నరేందర్‌రెడ్డి (సాయిరెడ్డి)ని డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప, నాయకులు రాంరెడ్డి, శకుంతల, రాంచంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, దస్తప్ప, వెంకటేశ్, మల్లప్ప, నర్సింలు, మల్లికార్జున్, రాములు, జయప్ప, బాలయ్యగౌడ్, రాజు, పంచాయతీ కార్యదర్శి ఫక్రోజీ పాల్గొన్నారు.

వివాహ వేడుకలో సీఎం



వివాహ వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ సమీపంలోని పీపీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన వివాహ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన తూర్పు సరళ, అచ్యుత్‌రెడ్డి కుమారుడు ఆదిత్యరెడ్డి వివాహం బాకారం గ్రామానికి చెందిన రమ, చంద్రశేఖర్ దంపతుల కుమార్తెతో జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మనమే లాస్ట్

పది ఫలితాల్లో జిల్లాకు 33వ స్థానం

- ఉత్తీర్ణత శాతం పెరిగినా ఆఖరు స్థానానికే పరిమితం
- ఎప్పటి మాదిరిగా బాలికలదే పైచేయి
- 580 మార్కులతో సత్తా చాటిన నవాబుపేట గురుకుల విద్యార్థి



వికారాబాద్: ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి వార్షిక ఫలితాల్లో జిల్లా మళ్లీ చివరి స్థానానికే పరిమితమైంది. గతేడాది సైతం ఇదే స్థానంలో నిలిచి 65 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 73.97 శాతంతో మెరుగైన ఫలితాలు సాధించారు. మూడేళ్ల క్రితం వరకు 24వ స్థానంలో ఉండగా.. ఈ ఏడాదితో వరుసగా మూడో సారి అట్టడుగు స్థానానికి పడిపోయింది. అధికారులు మౌలిక సదుపాయాలంటూ పాఠశాలల చుట్టూ తిరుగుతూ విద్యార్థుల సామర్థ్యాలపై దృష్టి సారించడంలో విఫలమయ్యారనే అపవాదు మూటగట్టుకున్నారు. రాష్ట్రంలో మొదటి స్థానం సాధించిన జిల్లా మహబూబాబాద్ 99.29 శాతం ఫలితాలు సాధించగా జిల్లా 26 శాతం వెనకబడి ఉంది. రాష్ట్ర సగటు 92 శాతం ఉండగా దానికన్నా 19 శాతం వెనకబడి ఉన్నాం. 32 వ స్థానంలో నిలిచిన ఆసిఫాబాద్ జిల్లా కంటే కూడా మనం 14 స్థానాలు వెనకబడి ఉండటం గమనార్హం. గతేడాది వరకు జీపీఏ రూపంలో ఫలితాలు ఇవ్వగా ఈ ఏడాది పాత పద్ధతిలో విద్యాశాఖ మార్కుల రూపంలో ఫలితాలు వెల్లడించింది. నవాబుపేట మండలానికి చెందిన గురుకుల పాఠశాల విద్యార్థి కార్తీక్ 600 మార్కులకు గాను 580 మార్కులు సాధించి సత్తా చాటాడు.

73.97 శాతం ఉత్తీర్ణత

జిల్లాలోని 20 మండలాల నుంచి వార్షిక పరీక్షలకు 12,846 మంది విద్యార్థులు హాజరవగా.. 9,502 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో మొత్తం ఈ ఏడాది పరీక్షలకు హాజరైన వారిలో 3,344 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. 73.97 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 78.14 శాతంతో బాలికలు మొదటి స్థానంలో నిలవగా 69.77 శాతంతో బాలురు అట్టడుగున నిలిచారు. రెండేళ్ల క్రితం పేపర్ లీకేజీ కారణంగా పోలీసులు, ఆయా శాఖల అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. కొన్ని చోట్ల పోలీసులే విద్యార్థులను చెక్ చేశారు. రెండేళ్లుగా విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్ష లు రాయలేకపోవటం ఫలితాలపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది.

ఫలితాలు నిరాశపరిచాయి



జిల్లా ర్యాంకు చివరన ఉన్నప్పటికీ ఫలితాల పరంగా చూస్తే గతేడాది కంటే మెరుగయ్యాం. తాము ఆశించిన ఫలితాలు మాత్రం రాలేదు. ఉపాధ్యాయులు కష్టపడినప్పటికీ ఫలితాలు నిరాశపరిచాయి. ఈ ఫలితాలను బేరీజు వేసుకుని సప్లిమెంటరీలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కార్యాచరణ రూపొందిస్తాం. ఏయే సబ్జెక్టులలో, ఏయే పాఠశాలల్లో తక్కువ ఫలితాలు వచ్చాయో సమీక్షించుకుని సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే వారికోసం ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలని యోచిస్తున్నాం. ఉత్తీర్ణులైన వారందరికీ అభినందనలు.

– జి.రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి

సంతోషంగా ఉంది



పదో తరగతి ఫలితాల్లో అధిక మార్కులు సాధించడం సంతోషంగా ఉంది. ఉపాధ్యాయులు ఇచ్చిన సలహాలు, సూచనలతో చదువుకున్నాను. మాది నిరుపేద కుటుంబం కావడంతో అమ్మానాన్నలు కష్టపడి చదివిస్తున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు భవిష్యత్‌లో మరింత రాణించేందుకు కృషి చేస్తాను.

– కార్తీక్, నవాబుపేట గురుకుల పాఠశాల

కార్మికులకు భద్రత ఏదీ..?

- సంక్షేమాన్ని మరిచిన యాజమాన్యాలు
- హక్కుల కల్పనలో ప్రభుత్వాలు విఫలం
- ఎన్నికల హామీకే పరిమితమైన ఈఎస్‌ఐ ఆస్పత్రి



నాపరాతిని లోడ్ చేస్తున్న కార్మికులు

తాండూరు: ప్రభుత్వాలు మారుతున్నా.. శ్రమజీవుల జీవన విధానంలో మార్పులేదు. కష్టాలు వీడడం లేదు. బతుకుబండి సాఫీగా సాగడం లేదు. కుటుంబ జీవన స్థితిగతులు వారిని మరింత కష్టాల కడలిలోకి నెట్టివేస్తున్నాయి. వేతనం గిట్టుబాటు కాక ప్రత్యామ్నాయ మార్గాలు లేక కార్మిక వృత్తినే కొనసాగిస్తూ కష్టాల కడలిని ఈదుతున్నారు. 1886 మే 1వ తేదీన చికాగో నగరంలో కార్మికుల వీరమరణంతో కార్మిక దినోత్సవానికి ఊపిరి పోసింది. నాటి నుంచి ప్రతి ఏటా మేడేను జరుపుకొంటున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా శ్రమ జీవుల హక్కుల కల్పనలో మాత్రం ప్రభుత్వాలు విఫలం చెందుతూనే ఉన్నాయి. కార్మికులు సమస్యల పరిష్కారానికి రోడ్డెక్కుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

కేంద్ర సహకారం లేక జాప్యం

జిల్లాలో భూగర్భ నిక్షేపాలు పుష్కలం. దీంతో కార్మికులకు నాపరాయి, ఎర్రమట్టి, సుద్ద వనరుల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్, తాండూరు మండలాల్లో 300 వరకు నాపరాతి గనులు, 500 వరకు నాపరాతి పాలిషింగ్ యూనిట్‌లున్నాయి. ఇక్కడ ప్రతీ ఏడాది సుమారు రూ.600 కోట్ల వరకు వ్యాపారం సాగుతోంది. ఇక్కడ పని చేసే కార్మికులు ప్రమాదాల బారిన పడినా వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద ఎత్తున కార్మికులు ఉన్నప్పటికీ తాండూరు ప్రాంతంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటులో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో తాండూరు పాత మున్సిపల్ భవనంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు యత్నించారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకపోవడంతో జాప్యం చేసుకొంటోంది.

కూలీలుగా పరిగణిస్తున్న యాజమాన్యాలు

తాండూరు నియోజకవర్గంలో నాపరాతి పరిశ్రమలపై ఆధారపడి 40 వేల మంది వరకు కార్మికులు నాపరాతి గనులు, పాలిషింగ్ యూనిట్‌లలో పని చేస్తున్నారు. దీంతో పాటు సీసీఐ, ఐసీఎల్, పెన్నా సిమెంట్ కర్మాగారాల్లో వేల మంది కార్మికులకు జీవనోపాధి లభిస్తుంది. కాంట్రాక్ట్ కార్మికులు ఎక్కువగా ఉండటంతో వారికి కార్మికులకు అందే ఫలాలు అందడం లేదు. గనులు, నాపరాతి పాలిషింగ్ యూనిట్‌లలో పని చేసే కార్మికులను రోజు వారి కూలీలుగా పరిగనించడంపై కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులకు అందాల్సిన ఫలాలు

- కార్మిక సంక్షేమ నిధి చట్టం ద్వారా ప్రతీ సంస్థ యజమాని కార్మికుడి తరఫున ఏడాదికి యజమాని వాటా కింద రూ.70, కార్మికుడి వాటా కింద రూ.30 వార్షిక చందా సంక్షేమ నిధికి చెల్లించాలి.
- వివాహ కానుకగా కార్మికుడి కూమార్తెకు, కార్మికురాలి వివాహం సందర్భంగా రూ.20 వేలను మూడేళ్ల పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందిస్తారు.
- విద్యా ప్రోత్సాహకం, ప్రతిభ ఆధారంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.5 వేలు, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు రూ.10 వేల వరకు అందిస్తోంది.
- ఆదర్శ కుటుంబం కింద కార్మికుడు లేదా కార్మికుడి భార్య కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకుంటే రూ.5 వేలు.
- కార్మికుడు మరణిస్తే అంత్యక్రియలకు రూ.10 వేలు.
- ప్రమాదం బారిన పడి అంగవైకల్యం పొందిన కార్మికుడికి రూ.2.50 లక్షల ఆర్థిక సాయం.
- కార్మికుడి వైద్యసాయం కోసం దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలకు రూ.50 వేల ఆర్థికసాయం.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఔత్సాహికులను ప్రోత్సహించాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: వ్యాపారాలు చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో నూతన ప్రాథమిక వ్యవసాయ సంఘాలు, పీఏసీఎస్ కంప్యూటరైజేషన్, నూతన పెట్రోల్ పంపులు, ఎల్‌పీజీ, మత్స్య సంఘాలు, డెయిరీ ఫాంలు, గోదాములు, ఏర్పాటు తదితర అంశాలపై జిల్లా సహకార అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులతో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మాట్లాడుతూ.. రైతుల అవసరాలకు అనుగుణంగా అదనంగా ప్రాథమిక వ్యవసాయ సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. కొత్త పెట్రోల్ పంపులు, ఇప్పటికే ఉన్న పెట్రోల్ పంపుల మార్పిడిపై దృష్టి సారించాలని సూచించారు. జన ఔషధి కేంద్రాలు, కిసాన్ సమృద్ధి కేంద్రాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. నేషనల్ కోఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్, నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్, భారతీయ బీజ్ సహకార్ సమితి లిమిటెడ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా సహకార అధికారి నాగార్జున, నాబార్డ్ డీడీఎం అఖిల్, జిల్లా సెంట్రల్ బ్యాంక్ సీఈఓ సుబ్రమణ్యం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సదానందం, వ్యవసాయ అధికారి పద్మావతి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

- కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు తప్పనిసరి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి వరి కొనుగోలు, సన్న బియ్యం పంపిణీ అంశాలపై జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. జిల్లాలో 128 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు కావలసిన తాడిపత్రిలు, సంచులు, తేమ యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వర్తించని వారిని తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. రైస్ మిల్లర్ల వద్ద బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత ఎప్పటికప్పుడు వారి ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. ఎలాంటి లోపభూయిష్టం లేకుండా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనిచేయాలని చెప్పారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రెయినీ కలెక్టర్ హర్ష చౌదరి, డీఆర్డీఓ శ్రీనివాస్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, వ్యవసాయ శాఖ ఏడీఏ స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.



అధికారులను సన్మానించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు

ముగ్గురు అధికారుల ఉద్యోగ విరమణ

నిజాయతీగా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించిన ప్రభుత్వ ఉద్యోగులకు జీవితంలో ఎంతో సంతృప్తిని ఇస్తుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం ఉద్యోగవిరమణ పొందుతున్న షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, యువజన క్రీడల అధికారి హనుమంతరావు, యలాల తహసీల్దార్ అంజయ్యను కలెక్టరేట్‌లో జిల్లా యంత్రాంగం ఆత్మీయ సన్మానం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ప్రజా సేవ చేసే అదృష్టం వస్తుందని.. నిబద్ధతతో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు అందుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అవసరమైన సమయంలో మీసేవలను తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రెయినీ కలెక్టర్ హర్ష చౌదరి, డీఆర్డీఓ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, డీబీసీడబ్ల్యూఓ ఉపేందర్, డీఎండబ్ల్యూఓ కమలాకర్ రెడ్డి, డీపీఓ జయసుధ, డీఈఓ రేణుకాదేవి, వివిధ శాఖల అధికారులు, దళిత సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొని వారిని ఘనంగా సన్మానించారు.

మొదటి గురువు బసవేశ్వరుడు

శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

అనంతగిరి: కుల, మత రహిత సమాజ నిర్మాణానికి కృషి చేసిన మహనీయుడు బసవేశ్వరుడని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం మహాత్మ బసవేశ్వర జయంతి సందర్భంగా వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఎన్నెపల్లిలోని జగజ్యోతి బసవేశ్వర విద్యా సంస్థల్లో నిర్వహించిన జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. సమాజం పట్ల అవగాహన కల్పించిన మొదటి గురువు బసవేశ్వరుడు అన్నారు. ఆయన ఇచ్చిన శాంతి సందేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వం కుల మతాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బస్వరాజు, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోశ్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, వీరశైవ సమాజం ప్రతినిధులు శివరాజు, ఆత్మలింగం, వీరన్న, విజయ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, షరీఫ్, వెంకట్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు. వికారాబాద్‌లో వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



బసవేశ్వర జయంత్యుత్సవాల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్

ఆయన మార్గం అనుసరణీయం

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: సమాజంలో కుల, లింగ, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు మహాత్మ బసవేశ్వరుడని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం బసవేశ్వర జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరితో కలిసి కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. తన బోధనలతో సమాజాన్ని మూఢాచారాల నుంచి కాపాడారని కొనియాడారు. సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త బసవేశ్వరుడి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీబీసీడబ్ల్యూఓ ఉపేందర్, డీఆర్డీఓ శ్రీనివాస్, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, డీఎస్ హెచ్ఓ సత్తార్, ఎస్సీ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి మల్లేశం, డీవైఎస్ఓ హన్మంతరావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

క్లుప్తంగా

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కుల్కచర్ల: కంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి కిరణ్ కుమార్, ఆప్తమాలిక్ అసిస్టెంట్ జవహర్ అన్నారు. బుధవారం కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శిబిరంలో భాగంగా 74 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 51 మందికి శుక్లాల సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తక్షణమే ఆపరేషన్లు నిర్వహించేందుకు 26 మందిని నగరంలోని ఓ ఆసుపత్రికి పంపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మసీదు వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న సాధన సంస్థ సభ్యులు

ధారూరు: బాల్య వివాహాల కట్టడికి మత పెద్దలు కృషి చేయాలని సాధన సంస్థ కోఆర్డినేటర్ బి.అంజయ్య సూచించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని దేవాలయాలు, మసీదుల్లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైనా బాల్య వివాహం జరపడానికి కుటుంబీకులు ప్రయత్నిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. లేదంటే 100, 1098 నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఆలయాలు, మసీదుల్లో మత పెద్దలు, స్థానికులతో కలిసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధన సంస్థ సభ్యులు ప్రతిజ్ఞ చేయించారు.

వేట కుక్కల దాడిలో జింక మృతి



జింక కళేబరం

పూడూరు: వేటకుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన బుధవారం దామగుండం అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. వేటగాళ్లు, కుక్కల బారిన పడి వన్యప్రాణులు చనిపోతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


విద్యుదాఘాతంతో మేకల మృతి



మేకల కళేబరాలు

పూడూరు: విద్యుదాఘాతంతో మేకలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చీలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం ఈదురు గాలితో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పునరుద్ధరించిన తర్వాత గ్రామానికి చెందిన ఉలేన్‌బాయి రామన్న ఇంటితో పాటు మేకలు ఉన్న షెడ్‌కు విద్యుత్ షాక్ వచ్చింది. దీంతో తొమ్మిది మేకలు మృతి చెందాయి. కుక్కలు పట్టాయని అనుకుని వెళ్లి షెడ్‌ను పట్టుకున్న పలువురికి షాక్ తగిలింది. బాధితునికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



విగ్రహ ఆవిష్కరణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

అనంతగిరి: వచ్చే నెల 7న వికారాబాద్‌లో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహ మహోత్సవ వాల్ పోస్టర్‌ను బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శంకరయ్య, జాయింట్ సెక్రెటరీ ఆనంద్, సీనియర్ న్యాయవాదులు కమాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి, నారాయణ, బాలయ్య, వెంకటేష్, రాము, పార్థసారథిరావు, విగ్రహ ఆవిష్కరణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోతల జోరు.. నూర్పిళ్ల హోరు

- హార్వెస్టర్లకు పెరిగిన డిమాండ్
- వరికి మద్దతు ధర పెంచాలని రైతుల విజ్ఞప్తి
- పెట్టుబడులు రావడంలేదని ఆందోళన



హస్నాబాద్‌లో అమ్మేందుకు ఆరబెట్టిన వడ్లు



కుదురుమల్లలో ధాన్యాన్ని ట్రాక్టర్‌లో నింపుతున్న హార్వెస్టర్

దుద్యాల్: గ్రామాల్లో ప్రస్తుతం వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఎక్కడ చూసిన కోత యంత్రాలు(హార్వెస్టర్లు), నూర్పిళ్ల సందడి దర్శనమిస్తోంది. ఆయా పనుల్లో రైతులు, కూలీలు నిమగ్నమయ్యారు. వ్యవసాయ కూలీలకు చేతినిండా పని లభిస్తోంది. కోత సమయం కావడంతో హార్వెస్టర్లకు సైతం డిమాండ్ ఏర్పడింది. మండలంలో దాదాపు 7 నుంచి 8 వేల ఎకరాలకు వరకు వరి పంటను సాగు చేశారు. భానుడి ప్రతాపానికి భూగర్భ జలాలు తగ్గిపోవడంతో కొంతమేర పంట ఎండిపోయింది. ప్రస్తుతం 5 వేల ఎకరాల వరకు వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. బురదగా ఉన్న పొలాల్లో కోతలకు ఇబ్బందిగా మారింది. ఇదే అదునుగా భావించిన హార్వెస్టర్ల యజమానులు రెట్లను అమాంతం పెంచేశారు.

కూలీలకు డిమాండ్

మరోవైపు కూలీలకు డిమాండ్ ఎక్కువైంది. ఒక్కో కూలీకి రూ.500 వరకు అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం వరి పంట కోయడానికి దాదాపు 15 మంది అవసరం ఉంటుంది. యంత్రాల సహాయంతో కోతలు జరిపితే ఎకరానికి గంట సమయం మాత్రమే పడుతుంది. దీనికి రూ.3 వేల చొప్పున తీసుకుంటున్నారు. అదే కూలీలతో చేయిస్తే రూ.10వేల పైమాటే అంటున్నారు. అందుకే సమయం ఎక్కువైనా హార్వెస్టర్లనే కర్షకులు నమ్ముకున్నారు.

మద్దతు ధరపై విముఖత

వరి కోతల అనంతరం ధాన్యం అమ్మడానికి అన్నదాతలు వెనకడుగేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరలతో పెట్టుబడుల వరకు మాత్రమే వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటల్ ఏ గ్రేడ్ రకానికి రూ.2320, బి–గ్రేడ్‌కు రూ.2300 ఇస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలులో ఎన్నో నియమ నిబంధనలు పెట్టడమే కారణమని వాపోతున్నారు. మరోవైపు దొడ్డు, సన్న రకాలకు ఒకే ధరలు ప్రకటించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. దొడ్డు రకం క్వింటాల్‌కు రూ.2320 కాగా సన్న రకానికి రూ.2300లే ప్రకటించారు. దీంతోపాటు బోనస్ కలుపగా రూ.2800కి కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది.

సన్నాలపై అసంతృప్తి

సన్న రకాల వరి ధాన్యానికి సాధారణంగానే క్వింటాలుకు రూ.3 వేలపై వరకు ఉంటుంది. కానీ ప్రభుత్వం మాత్రం బోనస్‌తో కలిపి కేవలం రూ.2800 ప్రకటించింది. దీంతో సన్నరకం వరి సాగు చేసిన రైతులు ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం మద్దతు ధరలు పెంచి ఆదుకుంటుందనుకుంటే ధరలు తగ్గించి నట్టేట్ట ముంచుతుందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సన్న రకం వడ్లకు సర్కారు ధరలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

మద్దతు ధర పెంచాలి



ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను తక్కువ ధరలకే అమ్ముకోవాల్సి వస్తుంది. పెట్టుబడులు పెరిగినా మద్దతు ధర మాత్రం స్థిరంగా ఉంటుంది. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకుపోతే సాకులు చూపుతూ తరుగు తీస్తున్నారు. ప్రభుత్వమే మద్దతు ధర పెంచాలి.

– రాజు, రైతు, దుద్యాల్

సాగుకు వెనకడుగు



వరి పంటకు ప్రస్తుతం పెట్టుబడులు పెరిగాయి. ట్రాక్టర్ చార్జీలు, కూలీలు, కాంప్లెక్స్ ఎరువులు, పిచికారీ చేసే మందులు, హార్వెస్టర్లు ఇలా అన్ని రకాల ఖర్చులు ఎక్కువయ్యాయి. ఎకరా పొలం సాగు చేయాలంటే రూ.30 వేల పెట్టుబడులు అవసరమవుతున్నాయి. అందుకే వరి సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు.

– వీరప్ప, రైతు, దుద్యాల్

మహనీయుల ఆశయాలకు కృషి

జనజాతర సభలో ప్రొ. రవీందర్



ఐక్యత చిహ్నాన్ని చాటుతున్న నాయకులు

తాండూరు టౌన్: మనువాదంపై మహోద్యమం చేపట్టాలని కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ డాక్టర్ పసునూరి రవీందర్ అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే, అంబేడ్కర్ జన జాతర సభకు ఆయన ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తుదిశ్వాస వరకు మనువాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. నేటి కాలంలో మహనీయులను ఒక కులానికి మాత్రమే పరిమితం చేయడం ద్వారా వారిని అవమానిస్తున్నారని దుయ్యబట్టారు. మనుస్మృతి శూద్రులకు విద్యను నిషేధిస్తే, పూలే దంపతులు అందరికీ విద్యనందించారన్నారు. పురుష, మహిళ అనే భేదం లేకుండా సమానత్వం కోసం నాటి అనాగరిక సమాజాన్ని చైతన్య పరిచారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేవలం భారత రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కొలుస్తూ, ఆయన అధ్యయన లోతులను విస్మరిస్తున్నారన్నారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం తీరుతో రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు కాసుల వర్షం కురిపించేందుకు కేంద్రం జాతీయ విద్యా విధానాన్ని తెస్తోందన్నారు. నేటి యువతకు పూలే, అంబేడ్కర్ ఆశయాలను చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కన్న, ఉపాధ్యక్షుడు మహిపాల్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు బుగ్గప్ప, ఆనంద్, సురేష్, రాజు, గోపాల్, చంద్రయ్య, శ్రీనివాస్, బలరాం, రఘుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ : తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు



కుల్కచర్ల: చౌడాపూర్‌లో బసవేశ్వర జయంతిలో..

వైభవంగా బసవేశ్వరుడి జయంతి

మహాత్మా బసవేశ్వరుడి జయంతిని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారికంగా వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టారు. ఆయా చోట్ల వీర శైవ లింగ బలిజ సమాజం సభ్యులు ప్రత్యేక పూజలు చేసి అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



మర్పల్లి: బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ధారూరులో బసవేశ్వరుడి విగ్రహానికి పూజ చేస్తున్న భక్తులు



మోమిన్‌పేటలో బసవేశ్వరుని జయంతిలో గ్రామస్తులు



దౌల్తాబాద్‌లో వేడుకలు



కొడంగల్ రూరల్: మున్సిపల్ కార్యాలయంలో..



బంట్వారం: కోట్‌పల్లిలో విగ్రహం వద్ద..



బొంరాస్‌పేట: పూజలో నాయకులు

దాడి కేసులో ఒకరికి ఏడాది జైలు

కొడంగల్: మండల పరిధిలోని బూల్కాపూర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి కొడంగల్ మున్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఏడాది జైలు శిక్ష విధించారు. 2020లో జరిగిన ఇంటి గొడవలో శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డిపై అప్పటి ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న తర్వాత కొడంగల్ కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. శ్రీనివాస్‌రెడ్డి తలపై రాడ్డుతో కొట్టి దాడి చేసినందుకు సత్యనారాయరెడ్డికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ టీకాలు

కుల్కచర్ల: టీబీ హౌజ్ హోల్డ్ సభ్యులకు టీకాలు ఇచ్చామని కుల్కచర్ల వైద్యాధికారి కిరణ్ గౌడ్ చెప్పారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ కోఆర్డినేటర్ రాజు ఆధ్వర్యంలో వ్యాధిగ్రస్తులకు టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ వ్యాధిగ్రస్తులు ఉన్న ఇళ్లలోని ఇతర వ్యక్తులకు వ్యాధి సోకకుండా వారికి టీకాలు ఇచ్చామని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న ప్రతిఒక్కరూ టీకా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు మాధవి, మహేశ్వరి, టీబీ సూపర్‌వైజర్ గోపాల్, వైద్య సిబ్బంది సుజాత, సీనబాయి, నవీన్, సిరాజ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

తాండూరు రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు పోలీసులు అప్పగించారు. కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు నెలల నుంచి ఏడు ఫోన్లు పోగొట్టుకోవడంతో వారు ఫిర్యాదు చేశారు. దీంతో సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని గుర్తించారు. ఈ మేరకు బుధవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీ బాలకృష్ణరెడ్డి బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నగేష్, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెళ్లింట విషాదం

- బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం
- పెళ్లి కూతురు తాత మృతి
- తండ్రి పరిస్థితి విషమం

కుల్కచర్ల: పెళ్లింట విషాదం నెలకొంది. ఊహించని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెళ్లి కూతురు తాత మృతిచెందగా.. తండ్రి మృత్యువుతో పోరాడుతున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తపల్లికి చెందిన కర్నె అంజయ్య తన కూతురు గంగోత్రిని చౌడాపూర్ గ్రామానికి చెందిన రవికి ఇచ్చి బుధవారం వివాహం జరిపించారు. పెళ్లి వేడుకల అనంతరం.. పొలం పనులు చూసుకునేందుకు తన తండ్రి నర్సయ్య(70)ను దింపి వస్తానని బైక్‌పై చౌడాపూర్ నుంచి స్వగ్రామానికి బయల్దేరాడు. మక్తవెంకటాపూర్ శివారులో గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. నర్సయ్య రెండు కాళ్లు విరగడంతో ఆస్పత్రిలో మరణించాడు. అంజయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.



ఘటనాస్థలిలో నర్సయ్య

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

యాలాల: ప్రభుత్వ మద్దతు ధరతో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని రాస్నం గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోరాదన్నారు. ప్రభుత్వం రైతులకు అనుకూలంగా కేంద్రాల్లో మద్దతు ధరతో పాటు గోనే సంచులను అందుబాటులో ఉంచిందన్నారు. వీటితో పాటు సన్నాలకు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, డైరెక్టర్లు రాజు, నర్సింహులుగౌడ్, ఖాసీం, మాజీ ఉపసర్పంచ్ జనార్దన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మన్నాన్, నాయకులు వీరణ్ణ, సాయన్న, డీసీఎంఎస్ ఉద్యోగి పాండురంగం తదితరులు ఉన్నారు.



రాస్నంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఉద్యోగ విరమణ తప్పనిసరి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

యాలాల: ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదని కాంగ్రెస్ సీనియర్ నేత బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ హాలులో తహసీల్దార్ అంజయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగికి విరమణ కాలం తప్పదన్నారు. విధి నిర్వహణలో ఎన్నో అటుపోట్లు, ఒత్తిడిలు ఎదుర్కొని ప్రజలకు సేవలందించడం గొప్ప విషయమన్నారు. అనంతరం అంజయ్య మాట్లాడుతూ.. సొంత జిల్లా అయిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉద్యోగ విరమణ పొందడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది, నాయకులు తహసీల్దార్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పుష్పలీల, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు భీమప్ప, మాజీ సర్పంచ్ హన్మంతు, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌ఐలు శివచరణ్, వేణు, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

పరిగి: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని రంగంపల్లి గ్రామానికి చెందిన పలువురి లబ్ధిదారులకు బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్‌తో ఎంతో మంది నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. అనారోగ్యానికి గురైన వారికి ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషితో ప్రజలకు సంక్షేమాలను సక్రమంగా అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు వెంకట్, సురేష్, చందర్‌రెడ్డి, వీరారెడ్డి, శేఖరెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

ధారూరు: బీజేపీ తీవ్రవాద పార్టీ అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఆ పార్టీ నాయకులు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ధారూరుకు చెందిన అబ్దుల్ మాజిద్ ఇటీవల కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడితో పాటు హిందువులపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, వీటిని సోషల్ మీడియాలో పోస్టు చేయడం ఎంతవరకు సమంజసమని బీజేపీ నాయకులు వడ్లనందు, రాజునాయక్, రాజేందర్‌గౌడ్, కావలి అంజయ్య, రవీందర్‌గౌడ్ తదితరులు ప్రశ్నించారు. బీజేపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించామని, దీనిపై విచారణ జరిపి, వాస్తవాలను తెలుసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అనిత తెలిపారు.

సుదీర్ఘ సేవలు అభినందనీయం

అనంతగిరి: విధి నిర్వహణలో మనం ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ కార్యాలయంలో వికారాబాద్ మహిళ పీఎస్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఎండీ హాషంకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సుదీర్ఘంగా సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. 41 ఏళ్ల పాటు విధులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఏఓ జ్యోతిర్మణి, ఉమెన్స్ పీఎస్ సీఐ శివచంద్ర, ఆర్‌ఐలు, జిల్లా పోలీసు ప్రెసిడెంట్ అశోక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌ఐ ఎండీ హాషంను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

విగ్రహావిష్కరణకు తరలిరండి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఏర్పుమళ్లలో మే 4న నిర్వహించే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘాల తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని రేగడిమైలారం, కొత్తూరులో గోడపత్రికలు విడుదల చేశారు. మహిళలు, యువకులు కమిటీలుగా ఏర్పడి ముందుకు రావడం హర్షణీయమన్నా రు. కార్యక్రమంలో కేఎస్‌పీఎస్ మండలాధ్యక్షుడు అంజిలప్ప, నాయకులు లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఉపయోగమున్నా.. ప్రచారం కరువు

- ఉపాధి కూలీలకు 'జన్‌మన్‌రేగ' యాప్
- ఫోన్‌లోనే అన్ని వివరాలు తెలుసుకోవచ్చు
- శ్రమజీవులకు అందని సాంకేతిక సేవలు



యాంకి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దౌల్తాబాద్: ఉపాధి కూలీల కోసం ప్రత్యేకంగా జన్‌మన్‌రేగ యాప్ అందుబాటులోకి వచ్చింది. దీంతో కూలీలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆ యాప్‌లోనే చూసుకునే అవకాశం ఉంటుంది. ఇంత ఉపయోగకరంగా ఉన్న యాప్‌పై కూలీలకు అవగాహన కరువైంది. ఈ యాప్ గతేడాది నుంచి అందుబాటులో ఉన్నప్పటికీ ఏ ఒక్క కూలీ కూడా ఉపయోగించిన దాఖలాలు లేవు.

యాప్‌తో ప్రయోజనాలివే!

ఉపాధి కూలీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జన్‌మన్‌రేగ యాప్‌తో కూలీలు ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఆన్‌డ్రాయిడ్ ఫోన్ కలిగిన ప్రతి కూలీ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న అనంతరం జాబ్‌కార్డు, మస్టర్ నంబర్లతో కూడిన పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. దీంతో కుటుంబంలో ఎంతమంది ఉపాధి కూలీ పనులకు వెళ్తున్నారు. ఏ రైతు భూమిలో పనిచేశారు. ఎంత అమౌంట్ పడింది. ఏ బ్యాంక్‌లో ఎప్పుడు పడింది. అనే వివరాలు అందుబాటులో ఉంటాయి. పని ప్రదేశానికి ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లి అప్‌లోడ్ చేసిన వెంటనే ఆ రోజు ఎంత పనిచేశారు. ఎంత కూలీ గిట్టుబాటు అయ్యిందనే అంశాలన్నీ ఉంటాయి. ఫోన్‌లో చూసుకుని సదరు బ్యాంకు, పోస్టాఫీసుకు వెళ్లి నేరుగా డబ్బులు తీసుకునే అవకాశం ఉంటుంది. ఫీల్డ్ అసిస్టెంట్లు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇంతటి ఉపయుక్తకరమైన యాప్‌పై కూలీలకు అవగాహన లేకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు ఈ అంశంపై దృష్టి సారించాలి.

అవగాహన కల్పిస్తున్నాం



జన్‌మన్‌రేగ యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. దీంతో కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పని లేదు. యాప్‌లో చూసుకుని డబ్బులను బ్యాంకు వెళ్లి ఉపసంహరణ చేసుకోవచ్చు.

– అంజిలయ్య, ఏపీఓ, దౌల్తాబాద్